క్లుప్తంగా

రామన్నపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: రామన్నపాలెం 1 సచివాలయ ఆవరణలోని ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మొగల్తూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ సుమారు 70 రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో లేవలేని స్థితిలో ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వారిని పరీక్షించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది నాగజ్యోతి, పి.రామకృష్ణ, ఘనరత్నం, ప్రభాకర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గడప గడపకు నిధులతో రోడ్ల నిర్మాణం



భీమలాపురంలో నిర్మిస్తున్న రోడ్డు

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి భీమలాపురంలో శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాలతో రూ.20లక్షలతో రహదారుల నిర్మాణానికి సోమవారం చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీలు, బీసీ ఏరియాల్లోనూ రహదారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. రహదారి పనులను ఏఎంసీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌ఛార్జి మొల్లేటి రామకృష్ణ, నాయకులు పరిశీలించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు బిళ్లు స్ఫూర్తిదాయకం



లక్ష్మణేశ్వరంలో స్వాతంత్ర్య సమరయోధుని కుటుంబీకులను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు బిళ్ల కృష్ణమూర్తి కుటుంబీకులను గ్రామస్తులు సత్కరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి స్వాతంత్ర్య సాధనలో తనదైన ముద్ర వేసుకున్న బిళ్ల కృష్ణమూర్తి సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన కుమారులైన సత్యనారాయణ మూర్తి, నరసింహారావులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమాని వెంకటరాజు, ఎంపీటీసీ సభ్యుడు కోలపర్తి రామకృష్ణ, గ్రామ కార్యదర్శి యర్రంశెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచ్ అల్లు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవాభావం కలిగి ఉండాలి

పెనుగొండ: యువత సేవాభావం కలిగి ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ, లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం పెనుగొండ విశ్వతేజ జూనియర్, డిగ్రీ కళాశాలలో జరిగిన లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. పెనుగొండ లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. నూతన కమిటీ అధ్యక్షునిగా ఎం.నాగబాబు, కార్యదర్శిగా ఎం.లక్ష్మణ్, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్‌గా కె.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, జి.చంటి, సంయుక్త కార్యదర్శిగా జె.విజయ్‌కుమార్, నిర్వాహకునిగా జి.బులిపుల్లారావు, క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్‌గా ఎం.సత్య సూర్యప్రసాద్, మెంబర్‌షిప్ చైర్ పర్సన్‌గా గుర్రాల శ్రీనివాసరావు, క్లబ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్ పర్సన్‌గా జి.సూర్యారావు, గ్రేటర్ కమిటీ చైర్‌పర్సన్‌లుగా ఎ.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీసీహెచ్‌వీ సత్యనారాయణ రెడ్డి, పులిగెడ్డ శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధిలో నరసాపురం పరుగులు

- 14వ ఆర్థిక సంఘ నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- రూ 3.37 కోట్లు కేటాయింపు
- ఇప్పటికే పూర్తయిన పలు పనులు
- చురుగ్గా సాగుతున్న పెండింగ్ పనులు

నరసాపురం: పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన ఈ పనుల్లో పలు ప్రధానమైన రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. పెండింగ్ పనులు వర్షాలు తగ్గిన నేపథ్యంలో వెంటనే పూర్తి చేయాలని నిర్ణయించారు. దీంతో కీలకమైన ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్లకు కొత్తరూపు వచ్చినట్టయ్యింది. ముఖ్యంగా ఇటీవల మున్సిపల్ సాధారణ నిధులను భారీగా ఖర్చుచేస్తూ అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపాలిటీ, తాజాగా 14వ ఆర్థిక సంఘం నిధులతో వేసవి పూర్తిగా రోడ్లు, డ్రెయిన్‌లను నిర్మించాలని తలపెట్టింది. టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. స్టేషన్‌పేట, గ్రేస్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల డ్రెయిన్లు కూడా శిథిలమయ్యాయి. దీంతో ప్రధానంగా 14వ ఆర్థిక సంఘం నిధులను ఈ ప్రాంతాల్లో వెచ్చించి పనులు చేపట్టారు.



స్టేషన్‌పేట వద్ద రైల్వేస్టేషన్ సమీపంలో రూ.1.05 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు, కెనాల్ సపోర్టింగ్ వాల్

రూ.3.37 కోట్లతో అభివృద్ధి పనులు

14వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.37 కోట్లతో మార్చిలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఏడాదిన్నర క్రితం స్టేషన్‌పేట ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వెనుక చినమామిడిపల్లి మీదుగా రైల్వేగేట్ సమస్యకు పరిష్కారంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. అయితే ఇప్పుడు ఈ బైపాస్ రోడ్డుకు అనుసంధానంగా స్టేషన్‌పేటలో ఉన్న రోడ్డును 14వ ఆర్థిక సంఘం నిధులతో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి చేశారు. రూ.1.05 కోట్లతో సీసీ రోడ్డు, కెనాల్ పక్కన సపోర్టింగ్ వాల్ నిర్మించారు. ఇది కీలకమైన ప్రాధాన్యమైన అంశం. సుమారు 30 గ్రామాల ప్రజలు ఇటుగా ప్రయాణిస్తారు. వీరందరికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా మారింది. అలాగే స్టేషన్‌పేట నుంచి గ్రేస్ నగర్ వరకు రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. 22వ వార్డులో రూ.42 లక్షలతో సీసీ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు, 2వ వార్డులో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్, 1వ వార్డు శ్రీహరిపేటలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ రహదారులు వినియోగంలోకి వస్తే ప్రజల రవాణా ఇబ్బందులు పూర్తిగా తీరనున్నాయి.

రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పట్టణంలోని వార్డుల్లో చాలా కాలంగా రోడ్లు, డ్రెయిన్లు శిథిలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ఇబ్బందులు గమనించి ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపాలిటీని ఆదేశించాం. చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. పనులు నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా అవసరాలు తీర్చడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలి

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి - నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు ఆచంట అలివేలు, కామన బాల సత్యనారాయణ (బుజ్జి), ఆశపు కోటిలాల్, త్రివిధ దళాలలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు లెఫ్టినెంట్ కల్నల్ ఆర్‌కేవీ రావు, సీనియర్ నాస్ కమిషన్డ్ ఆఫీసర్ ఏవీ రమణ, నాయక్‌లు జోగి బాలరాజు, కె.జాన్ ఫ్రెడ్రిక్, ఎం.సుధాకర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిఫల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్మన్‌లు కొత్తపల్లి భుజంగరాయుడు, కామన నాగిని, మున్సిఫల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవం

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ పాలకొల్లు కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జెండా వందనం అనంతరం 9.30 గంటలకు గాంధీబొమ్మల సెంటర్‌లో జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మణిపూర్ బాధితులను ఆదుకోవాలి

పెనుగొండ: మణిపూర్‌లో మూడు నెలలకుపైగా జరుగుతున్న దాడులపై పెనుగొండ మండల పాస్టర్స్ అసోసియేషన్ నిరసన వ్యక్తం చేసింది. మణిపూర్ బాధితులను తక్షణమే ఆదుకుని, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెనుగొండ పంచాయతీ పార్కు నుంచి ఎస్వీకేపీ కళాశాల వరకు క్రైస్తవ సంఘాలు, హిందూ మైనార్టీ సంఘాలు, పలు పార్టీల సమన్వయంతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుధాకర్, ఉపాధ్యక్షులు జి.విజయకుమార్, ఎస్.రాంబాబు, కోశాధికారి ఎం.చంద్రబోస్, కన్వీనర్ కె.ఎలీషా, కె.అనిల్, టి.బుల్లియ్య, ఎన్‌సీసీ మీడియా రాష్ట్ర కన్వీనర్ గుత్తుల సాల్మన్ దొర, పెనుమంట్ర,, పోడూరు, ఇరగవరం మండలాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

పాలకొల్లు సెంట్రల్: మాసశివరాత్రి పురస్కరించుకుని సోమవారం పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాన్యాసపూర్వక అభిషేకాలు, జనార్దనస్వామికి అర్చనలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు, గోపూజలు నిర్వహించారు. మధ్నాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి స్వామివారికి లక్ష ముత్యాలపూజ, లీలాకళ్యాణం, పంచహారతులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న గుడాల గోపి

శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గోపికి ఆలయ పండితులు వేద ఆశీర్వచనం పలికారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నేత గుడాల గోపికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ చైర్మన్, ఈవో



నరసాపురం: 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 77 అడుగులు జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

మొగల్తూరు: సార్వా నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కాలువలు వదిలినా చేలల్లోకి నీరు చేరకపోవడంతో సాగు పనులు ఆలస్యమయ్యాయి. గత నెల విరివిగా వర్షాలు పడి చేలల్లో నీరు చేరడంతో దుక్కులు మొదలు పెట్టారు. దీంతో మండలంలోని 1,198 ఎకరాలకు సంబంధించి కేవలం 300 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. అయితే ఇటీవల మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం, శేరేపాలెం పంచాయతీ నవుడూరు గరువు, రామన్నపాలెం, కేపీపాలెం, పేరుపాలెం గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు తెలిపారు. రైతులు ఎక్కువ మంది 140 నుండి 145 రోజులకు పంట చేతికొచ్చే 1061, 1064, 1318 సంపద సృష్టి వంటి రకాల విత్తనాలను వినియోగించారని, రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు తమ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మొగల్తూరు పంచాయతీ నక్కావారి పాలెంలో నాట్లు వేస్తున్న కూలీలు

విద్యుత్ సౌకర్యం కల్పనకు హామీ

పాలకొల్లు అర్బన్: పూలపల్లి జగనన్న కాలనీకి ఎస్సీ సబ్ ప్లాన్‌లో నిధులు మంజూరు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో సోమవారం జగనన్న కాలనీవాసులు కలిసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గోపిని కోరగా ఆయన స్పందించారు. తక్షణమే ఆయన విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను తెలుసుకున్నారు. రూ.16 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు మంజూరు కావాల్సి ఉందని అధికారులు వివరణ ఇచ్చారు. దీంతో పూలపల్లి జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తే సబ్ ప్లాన్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



గోపికి సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

గోపిని కలిసిన పార్టీ నాయకులు

ఏఎంసీ అతిథి గృహంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గోపిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ పట్టణాధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: వచ్చేనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పాలకొల్లు బార్ అసోసియేషన్ సెక్రటరీ వేదాల నాగరాజు తెలిపారు. సోమవారం ఉల్లంపర్రు గ్రామంలోని అన్నపూర్ణ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే నగదు, సమయం వృథా కాకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు న్యాయపరమైన సమస్యలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాటం ప్రసాద్, అయజ్‌బాబు, విస్సాకోటి అనిత, ఇంజేటి సుధ, ఇ.ప్రశాంతి, విద్యార్థినులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు

ఆగర్తిపాలెం సర్పంచ్‌గా లక్ష్మీకుమారి ఏకగ్రీవం

పాలకొల్లు అర్బన్: సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఆగర్తిపాలెం సర్పంచ్‌గా కావలి లక్ష్మీకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే దిగమర్రు 7వ వార్డు సభ్యునిగా మన్నె మోహనరావు, వెలివెల 10వ వార్డు సభ్యురాలిగా కొప్పిసీడి కృష్ణవేణి, దగ్గులూరు 12వ వార్డు సభ్యునిగా విశ్వనాథం పేరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, విశ్వనాథం కనకభద్రం, కెల్లా సింహాచలం, శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

గోరింటాడ, చింతపర్రులో..

గోరింటాడ 6వ వార్డుకు చవ్వాకుల మణి ప్రియాంక, పీతల యామిని దుర్గా చంద్రకళ, చింతపర్రు 6వ వార్డుకు గూడవల్లి వెంకటరమణ, అంగర రామలక్ష్మిలు పోటీలో ఉన్నారు. ఈనెల 19న పోలింగ్ నిర్వహణకు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఏర్పాట్లు చేస్తున్నారు.

దొడ్డిపట్ల సర్పంచ్‌గా ప్రమీల ఎన్నిక ఏకగ్రీవం

యలమంచిలి: దొడ్డిపట్ల సర్పంచ్‌గా చెల్లుబోయిన ప్రమీలకుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌ఓ వర్ధనపు కాసు ప్రకటించారు. 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆమె భర్త చెల్లుబోయిన నరసింహారావు (పండు) సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికైన ఏడాది కాలానికే ఆయన అనారోగ్యంతో మరణించారు. సర్పంచ్‌గా ఎన్నికైన ప్రమీల కుమారికి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కావలి లక్ష్మీకుమారి



దిగమర్రు వార్డు సభ్యునిగా ఎన్నికైన మన్నె మోహన్‌రావుకు ఎన్నిక పత్రం అందజేస్తున్న దృశ్యం

కె.బేతపూడి, తూర్పుతాళ్ల గ్రామాల్లో..

నరసాపురం రూరల్: మండలంలోని కె.బేతపూడి, తూర్పుతాళ్ళ గ్రామాల్లో వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. తూర్పుతాళ్లు 12వ వార్డు సభ్యుని స్థానానికి దాఖలైన రెండు నామినేషన్లలో ఒకటి ఉపసంహరించుకోవడంతో కటకట్ల రమాశ్రీ జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ పుష్పరాజ్యం తెలిపారు. అలాగే కె.బేతపూడి 3వ వార్డుకు గానూ బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో కటికెల ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి జాన్ ప్రభాకర్ తెలిపారు.

వెలగలేరులో ఏకగ్రీవం

పెనుమంట్ర: వెలగలేరు 7వ వార్డులో గ్రామ మాజీ సర్పంచ్ గుడిమెట్ల లలితా పద్మిని కుమారుడైన గుడిమెట్ల వెంకటరెడ్డి నామినేషన్ ఒక్కటే ఉండటంతో ఆయన ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అదేవిధంగా మార్టేరు 14 వార్డులో నాలుగు నామినేషన్లుకు గానూ ఒకరు ఉపసంహరించుకోవడంతో కప్పల అనంతలక్ష్మి, కారెం వరలక్ష్మి, జాలెం సుచంద్రిక బరిలో ఉండటంతో ఇక్కడ ముక్కోణ పోటీ జరగనున్నది.